## ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు


కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్

సుల్తానాబాద్, మే 5 : సుల్తానాబాద్‌లోని యాదవనగర్ రైల్వేగేటు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ లీక్‌తో పాటు అధికమైన ఎండల ప్రభావంతో సోమవారం కాలిపోయింది. ఇటీవలే రైల్వేగేటు వద్ద ఉన్న 11 కేవీ లైన్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడడంతో విద్యుత్ సరఫరాలో రోజుల తరబడి అంతరాయం ఏర్పడుతుందని, ఇప్పుడు ఈ టాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పంట పొలాలకు సాగునీరు అందించడం ఎలాగోనని రైతులు ఆందోళనలో పడ్డారు. సమస్యను పరిష్కరించి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. కాగా, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకుని సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేసి, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

# సార్వత్రిక సమ్మెకు సై



- ఏకమవుతున్నకార్మిక సంఘాలు
- 20న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షల మంది పాల్గొనే అవకాశం
- మద్దతుగా నిలుస్తున్న బీఆర్‌టీయూ
- పరిశ్రమలకు ట్రేడ్ యూనియన్ల సమ్మె నోటీసులు
- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రధాన డిమాండ్

**కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక, నిరంకుశ విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతున్నది. శతాబ్ధ కాలంలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశంలోని 12 కార్మిక సంఘాల ఫెడరేషన్లు ఈ సమ్మెకు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు రంగాలకు చెందిన సంఘటిత, అసంఘటిత కార్మికులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు సుమారు 3.50 లక్షల మంది పాల్గొనే అవకాశమున్నది. వామపక్ష పార్టీల అనుబంధ సంఘాలతోపాటు బీఆర్‌ఎస్ కార్మిక విభాగం కూడా ఈ సమ్మెలో పాల్గొననున్నది.**

కరీంనగర్, మే 5(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, రైతులను నిర్వీర్యం చేసే నూతన వ్యవసాయ విధానం, విద్యుత్తు బిల్లు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పలు కార్మిక, రైతు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతున్నది. ఎన్నో దశాబ్ధాలపాటు పోరాటాలు చేసి సాధించుకున్న తమ హక్కులను కాలరాస్తూ అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. కార్మికులు సాధించుకున్న హక్కుల్లో ప్రధానమైనది సంఘటితం. అందుకు వ్యతిరేకంగా కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి సంఘటితం కాకుండా కేంద్రం చట్టాలు చేసింది. దీనిని కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బ్యాంకులు, బీమా, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటున్నదని ఇటు ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు సైతం సమ్మెలో భాగస్వాములవుతున్నారు. ముఖ్యంగా సార్వత్రిక సమ్మెలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగంతోపాటు వామపక్ష పార్టీల అనుబంధ సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనబోతున్నాయి. సింగరేణి, ఎల్‌ఐసీ, బీఎస్‌ఎన్‌ఎల్, రక్షణ శాఖ బ్యాంకింగ్ ఫెడరేషన్, రైల్వే ఉద్యోగులు సైతం సమ్మెలో పాల్గొంటున్నారు. దేశ వ్యాప్తంగా 12 ట్రేడ్ ఫెడరేషన్లు సంయుక్తంగా సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. జిల్లాలో సమ్మెను విజయవంతం చేసేందుకు బీఆర్‌టీయూతోపాటు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ వంటి కార్మిక సంఘాలు ఐకమత్యంగా సమ్మెను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాయి. సింగరేణి, ఎన్‌టీపీసీ ఉద్యోగుల తోపాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, ఉపాధి హామీ కూలీలు కూడా ఈ సమ్మెలో పాల్గొనేలా చేసేందుకు సీఐటీయూ, బీఆర్‌టీయూ, తదితర కార్మిక సంఘాలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

### లేబర్ కోడ్స్ రద్దయ్యేదాకా పోరాటం

ఎందరో కార్మికులు ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న రోజుకు 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటలకు పెంచే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌ను రూపొందించిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ కోడ్ వల్ల కార్మికులకు ఎలాంటి రక్షణ లేకపోగా అనేక హానికరమైన విధానాలు పొందుపర్చారని కార్మికులు వాపోతున్నారు. పోరాడి సాధించుకున్న అనేక హక్కులను నిర్వీర్యం చేసే విధంగా కేంద్రం ఈ చట్టాలు చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. ఈ లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు నిరంతర పోరాటాలు చేయాలని కార్మిక సంఘాలు నిర్ణయించుకున్నాయి. నాలుగు లేబర్ కోడ్లతో ప్రభుత్వ రంగ సంస్థలను నేషనల్ మ్యానిటైజేషన్ విధానం ద్వారా పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. 2020 నుంచి 2023 వరకు యాజమాన్యాల లాభాల వాటా 38 శాతం నుంచి 51 శాతానికి పెరిగితే కార్మికుల జీతాల వాటా మాత్రం 18 నుంచి 15 శాతానికి తగ్గించారని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తమపై మోసపూరిత విధానాలను అమలు చేస్తున్నదనడానికి ఇదే నిదర్శనమని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. రైతులకు తీవ్రమైన నష్టాన్ని కలిగించే మూడు నల్ల చట్టాలను తెచ్చేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించిందని, రైతులు తిరుగుబాటు చేయడంతో దిగి వచ్చి ఆ చట్టాలను రద్దు చేసిందని, ఇదే స్ఫూర్తిలో లేబర్ కోడ్‌ను రద్దు చేసే వరకు కార్మిక వర్గాలు పోరాటాలకు సిద్ధమవుతున్నాయి. అందులో భాగంగానే ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు 12 కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి.

### కార్మికులు చేస్తున్న ప్రధాన డిమాండ్లు

- నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి.
- కనీస వేతనం కింద రూ.26 వేలు చెల్లించాలి.
- ఔట్ సోర్సింగ్, ఫిక్స్‌డ్‌టర్మ్ ఎంప్లాయిమెంట్, అప్రెంటీస్, తదితర విధానాల్లో వివిధ పథకాల కింద పనిచేస్తున్న కార్మికులెవరినీ క్యాజువలైజ్ చేయద్దు.
- కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.
- కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి.
- సామాజిక భద్రత కల్పించాలి.
- పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి.
- ఎన్‌ఎస్‌పీ, యూఎస్‌పీ విధానం రద్దు చేయాలి.
- బోనస్ ప్రావిడెంట్ ఫండ్ చెల్లించాలి.
- అర్హతపై సీలింగ్‌ను తొలగించాలి.
- గ్రాట్యుటీ మొత్తాన్ని పెంచాలి.
- 45 రోజుల్లో యూనియన్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి.
- విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలి.
- రైల్వేలు, విమాన సేవలు, బ్యాంకులు, ఇన్స్యూరెన్స్, బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఆలోచనలు విరమించుకోవాలి.
- పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలి.
- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.
- ఉచిత విద్య, వైద్యం, నీరు, అందరికీ పారిశుధ్యం అందుబాటులోకి తేవాలి.
- అందరికీ గృహ నిర్మాణ అనుమతి కల్పించాలి.

### పరిశ్రమలకు సమ్మె నోటీసులు

దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్న కార్మిక సంఘాలు ఇప్పటికే పలు పరిశ్రమల యాజమాన్యాలకు సమ్మె నోటీసులు అందిస్తున్నాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాలోని రైస్ మిల్లులు, గ్రానైట్ పరిశ్రమల యజమానులు, హరిత బయో ప్రొడక్ట్ కంపెనీకి, ప్రియా మిల్క్స్ డెయిరీ, నాగార్జున మిల్క్ డెయిరీ, సీడ్స్ మిల్స్, జిన్నింగ్ మిల్స్, ఆటోమొబైల్ షోరూంలు, డీ మార్ట్, ఫ్లిప్ కార్ట్‌లు, మోర్ సూపర్ మార్కెట్లు, తదితర షాపింగ్ మాల్స్‌కు సమ్మె నోటీసులు ఇచ్చారు. చట్ట ప్రకారం ఈ నెల 14 వరకు వివిధ పరిశ్రమల యజమాన్యాలకు సమ్మె నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకు మరిన్ని పరిశ్రమలకు సమ్మె నోటీసులు ఇస్తున్నామని సీఐటీయూ బాధ్యులు ఎడ్ల రమేశ్ తెలిపారు. ఒక్క కరీంనగర్ జిల్లా నుంచి లక్ష మంది కార్మికులు సమ్మెలో పాల్గొనే విధంగా సన్నద్ధం చేస్తున్నామని, తమ సంఘం ఆధ్వర్యంలోనే 50 వేల మందికి తక్కువ కాకుండా సమ్మెలో పాల్గొంటున్నారని రమేశ్ వివరించారు.




కేశవపట్నం: వెటర్నరీ దవాఖాన దారిలో తెగి పడిన విద్యుత్ వైర్లు


మానకొండూర్: జగ్గయ్యపల్లిలో గాలికి రాలిపోయిన మామిడి కాయలను చూపిస్తున్న రైతులు


కొడిమ్యాల: కురిసిన వడగండ్లు


కేశవపట్నం: రోడ్డుపై విరిగి పడ్డ చెట్టు కొమ్మ


కొడిమ్యాల: అప్పారావుపేటలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు నరాల రాజు

# అకాల బీభత్సం

- ఉమ్మడి జిల్లాలో ఈదురుగాలులతో వర్షం
- అక్కడక్కడ వడగండ్లు
- కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- నేలరాలిన మామిడి కాయలు
- రైతులు లబోదిబో


గంగాధర : మార్కెట్‌లో వర్షానికి తడవకుండా ధాన్యంపై టార్పాలిన్ పరదాలు కప్పుతున్న రైతులు

కరీంనగర్, మే 5 (నమస్తే తెలంగాణ) : అకాల వర్షం.. రైతన్నకు అపార నష్టాన్ని తెచ్చింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వాన కడగండ్లే మిగిల్చింది. కొడిమ్యాల మండలంలోని పలు గ్రామాల్లో వడగండ్లతో గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ఎండబోసిన ధాన్యం తడిసిపోగా, రైతులు లబోదిబోమన్నారు. అప్పారావుపేట గ్రామంలో ధాన్యం రాశులపై కవర్లు లేచిపోగా, ధాన్యం కొట్టుకుపోయింది. గంగాధర మండలంలోని అన్ని గ్రామాలతో పాటు రామడుగు మండలం వెలిచాల, వెదిర, దేశరాజ్‌పల్లి, షానగర్, పందికుంటపల్లి, కిష్టాపూర్, వన్నారం, కొక్కెరకుంట గ్రామాల్లో అకాల వర్షం గంటపాటు కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కాగా, తేమ శాతంతో సంబంధం లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరారు.శంకరపట్నం మండలం మొలంగూర్‌లో కాలేషు సంపత్ ఇంటి పై కప్పు రేకులు ఎగిరిపోయాయి. కేశవపట్నం-కరీంపేట్ దారిలో, కేశవపట్నం ఎత్తుగడ్డ వద్ద చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభం నేలకొరిగి, సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆముదాలపల్లిలో తాటి చెట్టుపై పిడుగుపడి మంటలు లేచాయి. తాడికల్, వంకాయగూడెం గ్రామానికి చెందిన గంట గణేశ్, నరాల కొమురయ్య బైక్‌పై హుజూరాబాద్ నుంచి ఇంటికి వస్తున్నారు. ఒక్కసారిగా ఈదురు గాలులకు బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో దవాఖానకు తరలించారు. కాగా, ఈదురు గాలులకు విద్యుత్‌శాఖకు రూ.3లక్షల నష్టం వాటిల్లినట్లు మానకొండూర్ ఏఈ ఆర్ సత్యనారాయణ తెలిపారు. రంగపేట, వెల్ది, వేగురుపల్లి, మానకొండూర్ గ్రామాల్లో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల స్ట్రక్చర్స్ నేల కూలాయని, 10 కరెంట్ పోల్స్ విరిగిపోయాయని, తీగలు తెగిపడ్డాయని చెప్పారు. మానకొండూర్ మండలంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు జగ్గయ్యపల్లి, లక్ష్మీపూర్, ఈదులగట్టెపల్లి, రంగపేట, వెల్ది, వేగురుపల్లి గ్రామాల్లోని మామిడి కాయలు నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు.


చందుర్తి: తిమ్మాపూర్‌లోని ఓ ఇంటిలో కిందపడ్డ సామగ్రి


కోరుట్ల: ఇళ్ల నుంచి బయటకు వచ్చిన మహిళలు

# భూకంప కలకలం

- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో స్వల్ప భూకంపం
- భయాందోళనకు గురైన ప్రజలు
- రిక్టర్ స్కేల్‌పై 3.8గా నమోదు!

కరీంనగర్, మే 5 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో స్వల్పంగా భూకంపం సంభవించింది. సోమవారం సాయంత్రం 6:48 గంటలకు 3 సెకండ్ల పాటు కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.8గా నమోదైనట్లు తెలుస్తున్నది. దీంతో ప్రజలు ఒక్కసారిగా భయకంపితులయ్యారు. గంగాధర, చొప్పదండిలో నివాస గృహాలు, దుకాణ సముదాయాలు, సూపర్‌మార్కెట్లలో సామానులు కిందపడిపోగా, ఏం జరుగుతుందోనన్న భయంతో ప్రజలు ఆందోళన చెందారు. ఇండ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. వీధుల్లోకి వచ్చి భూకంపం వచ్చిందంటూ చెప్పుకొన్నారు. కాసేపు కలవర పడ్డారు. పలుచోట్ల సీసీ కెమెరాల్లో రికార్డు అయిన భూకంప దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# కేసీఆర్ హయాంలోనే 'మల్కపేట' పూర్తి

- సాగునీరందించిన ఘనత ఆయనదే..
- మాజీ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్


మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ వద్ద కేసీఆర్ కటౌట్‌కు జలాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీపీ, నేతలు, రైతులు

కోనరావుపేట, మే 5: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే మల్కపేట రిజర్వాయర్ ప్యాకేజ్-9 పూర్తయిందని, రైతులకు సాగునీరందించిన ఘనత ఆయనదేనని మాజీ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ కొనియాడారు. సోమవారం స్థానిక రైతులతోపాటు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ వద్ద పారుతున్న సాగునీటిలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం తోపాటు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలోనే మల్కపేట రిజర్వాయర్‌లోకి రెండు మోటర్ల ద్వారా ట్రయల్ రన్ పూర్తి చేసి, ఒక టీఎంసీకి పైగా నీళ్లు నింపినట్లు గుర్తు చేశారు. ఎడమ కాలువ పనులు కొద్దిమేర పనులు నిలిచాయన్నారు. రైతులకు సాగు నీరందించడమే లక్ష్యంగా కేసీఆర్ కృషి చేశారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ నాయకులు రిజర్వాయర్‌ను తామే నిర్మించామని గొప్పలు చెప్పడం సరికాదన్నారు. కాలువలో ఉన్న చెత్తను తొలగించి తామే పనులు చేశామని చెప్పుకోవడం విడ్డూరమన్నారు. కాలువలో భూములు కోల్పోతున్న మల్కపేట రైతులకు కనీసం నష్టపరిహారం ఇవ్వకుండా పోలీసు బలగాలను మోహరించి వారిని అడ్డుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా రైతులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ గ్రామశాఖ అధ్యక్షుడు ఉత్తెమ్ శ్రీనివాస్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.


కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లిలో ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు

# కొనుగోళ్లలో జాప్యంపై ఆగ్రహం

- రోడ్డుపై ధాన్యం సంచులు వేసి బైఠాయింపు
- కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లి, గోవిందరావుపేటలో ధర్నాలు

కోనరావుపేట, మే 5: ధాన్యం కొనుగోళ్లలో నెలల తరబడి జాప్యం చేస్తుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడుపు మండి ధాన్యం బస్తాలను రోడ్డుపై వేసి బైఠాయించారు. కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లి, గోవిందరావుపేట తండాలో సోమవారం రోడ్డుపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి కోసి నెల రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ధాన్యం పది శాతం కూడా కొనలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగమేఘాల మీద సెంటర్‌ను ప్రారంభించి ఇప్పటివరకు అధికారులు కన్నెత్తి కూడా చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం జరుగుతుందని ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప ఎక్కడా సమర్థవంతంగా జరగడం లేదని విమర్శించారు. సెంటర్లలో ఉన్న ధాన్యం తేమ శాతం ఆరు, ఏడు వస్తుందని, దీంతో తూకంలో తరుగు వచ్చి రైతులమంతా తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. సాయంత్రం వేళలలో ఉరుములు, ఈదురుగాలులు వీయడంతో కేంద్రాల్లో ఉన్న రైతులు ''అయ్యో.. దేవుడా కాపాడు'' అంటూ వేడుకుంటున్నట్లు కన్నీటిపర్యంతమయ్యారు. రైతుల రెక్కల కష్టాన్ని ప్రభుత్వం ఇంత దారుణంగా చూడడం సరికాదని మండిపడ్డారు. మరో వైపు తూకం వేసిన ధాన్యం 6 వేలకు పైగా బస్తాలు నిల్వ ఉన్నాయని, లారీల కోసం లక్ష్మారెడ్డి అనే కాంట్రాక్టర్‌కు ఫోన్ చేస్తే మరో రెండు నెలల దాకా ధాన్యం తరలించవచ్చని నిర్లక్ష్యపు సమాధానం చెపుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మరో పదిహేను రోజులు గడిస్తే వర్షాలు పడుతాయని, అప్పుడు ధాన్యం పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇక సన్నపు వడ్లు కొనుగోలు చేసేందుకు ఇప్పటివరకు మిల్లులను కేటాయించలేదని తెలిపారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలకు క్షేత్రస్థాయిలో వెళ్లి రైతుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు పోలీసులు చేరుకుని రైతులను నచ్చజెప్పి ధర్నాలను విరమింపజేశారు.



### వరి కోసి రెండు నెలలైంది

నాకున్న ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేసిన. దాదాపు వరి కోసి రెండు నెలలు కావస్తుంది. ఈసారి ఆలస్యంగనే సెంటర్ ప్రారంభించిన్రు. వడ్లు సరిగా కొంటలేరు. మా సెంటర్‌ల జోకిన రెండు వేల బస్తాలు ఇప్పటివరకు తరలించలేదు. లారీలు సక్కగ రాక కొనుడు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. అధికారులను అడిగితే లారీలు ఖాళీ అవుతలేవని చెప్తున్నరు. కలెక్టర్ సారూ, ఎమ్మెల్యే సారూ వడ్లు తొందరగా కొనేలా చేయండి.

**- నేదురుల ఎల్లయ్య, రైతు (వట్టిమల్లగొల్లపల్లి)**



### లారీలు వస్తలేవు.. వడ్లు కొంటలేరు

మా ఊళ్లె సెంటర్ ప్రారంభించి నెలైతున్నా ఇప్పటి వరకు పది శాతం వడ్లు కూడా తరలించలేదు. తూకం వేసిన బస్తాలు ఎక్కడివక్కడ నిలిచిపోయినయ్. లారీలు రాక రైతులమంతా ఇబ్బందులు పడుతున్నం. సాయంత్రం వర్షం పడితే బస్తాలు తడిసి తరుగు వచ్చే ప్రమాదం ఉంది. ప్రభుత్వం వడ్ల కొనుగోలుపై చిన్నచూపు చూడడం సరికాదు. మరో పదిహేను రోజులైతే వర్షం పడే అవకాశాలున్నయ్. ఇక సెంటర్ల పోసిన ధాన్యపు రాశులను ఎప్పుడు తరలిస్తరు.

**-బొంగు రవి, యువరైతు (వట్టిమల్ల గొల్లపల్లి)**